

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా వ్యాప్తంగా శనివారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహాన్ తెలిపారు. మొత్తం 55 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 13,390 మందికి 12,930 మంది హాజరు కాగా 459 మంది గైర్హాజరయ్యారు. 97 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విభాగంలో 12,238 మందికి 11,992 మంది హాజరు కాగా 245 మంది గైర్హాజరయ్యారు. 98 శాతం హాజరు నమోదైంది. వృత్తి విద్యా విభాగంలో మొత్తం 1,152 మందికి 938 మంది హాజరు కాగా 214 మంది గైర్హాజరయ్యారు. 81 శాతం హాజరు శాతం నమోదైంది. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, శనివారంతో బ్రిడ్జ్ కోర్స్ మినహా రెగ్యులర్ సబ్జెక్టుల పరీక్షలు ముగిశాయని యోహాను తెలిపారు.

స్వచ్ఛాంధ్ర ర్యాంకింగ్స్‌లో..

పశ్చిమకు 24, ఏలూరుకు 15వ స్థానం



చెత్తను ఎత్తి బుట్టలో వేస్తున్న సిఎం చంద్రబాబు

స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపు

సింగిల్ వాడకం ప్లాస్టిక్‌ను తరిమికొడదాం


తణుకులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

కార్మికులకు సన్మానం, జ్ఞాపికలు అందజేత

సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ఎగబడిన జనం

తణుకు నియోజకవర్గ అభివృద్ధి పనుల నిధులకు సిఎం హామీలు

టిడిపి, కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం, దిశానిర్దేశం



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి నిమ్మల, ఎంఎల్ఏ రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, తణుకు, రూరల్

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రతి విభాగంలో పనితీరు ఆధారంగా ర్యాంకింగ్స్ తయారు చేశామంటూ రాష్ట్రంలో 26 జిల్లాలకు సిఎం ప్రకటించిన ర్యాంకుల్లో పశ్చిమ 97 పాయింట్లతో 24వ స్థానం, ఏలూరు 108 పాయింట్లతో 15వ స్థానంలో నిలిచాయి. జపాన్ వంటి దేశాల్లో రోడ్లపై చెత్త వేయరని, మనకూ అలాంటి అలవాట్లు రావాలని తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తణుకులో సిఎం పర్యటించారు. ఉదయం తొమ్మిది గంటలకు హెలికాప్టర్‌లో తణుకు చేరిన సిఎంకు మంత్రులు, ఎంఎల్ఏలు, అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా ఎన్‌టిఆర్ పార్కు, కూరగాయల మార్కెట్, ఐక్యనగర్‌లో సిఎం పర్యటించారు. మున్సిపల్ కార్మికులతో కలిసి చెత్త ఊడ్చి ఎత్తిపోశారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. కూరగాయల మార్కెట్‌లో వేస్టేజీను ఎరువుగా మార్చే యంత్రాలను పరిశీలించారు. ఐక్యనగర్‌లో వీధి విధానంలో అభివృద్ధి పనులు, పార్కు నిర్మాణంపై అక్కడి జనంతో మాట్లాడారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వేదిక ప్రాంగణానికి చేరుకుని ముందుగా అక్కడ ఏర్పాటు చేసి వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్‌ను పరిశీలించి వేదికపైకి సిఎం చేరుకున్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఒక్కసారి వాడి పారవేసిన ప్లాస్టిక్ నిషేధించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. స్టీల్ గ్లాసులు, ప్లేట్లు అమల్లోకి తెస్తున్నామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో మౌలిక సదుపాయాల కొరత ఉందని, కలెక్టరేట్‌ను ప్రజల భాగస్వామ్యంతో నిర్మించుకునే విధంగా చేయాలని సిఎంను కోరారు. భీమవరాన్ని అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీగా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులు రమణ, దుర్గావెంకటేష్, గంగాధరరావులతోపాటు, పరిశుభ్రతపై విశేష సేవలందిస్తున్న సూర్యచంద్రరావు, వనజ, గాదం లక్ష్మి కాలువ కిష్టి, జ్ఞాపికతో సిఎం సత్కరించారు. ప్రజావేదికలో పాల్గొన్న నర్సింగరావు, భాస్కరరావు, నందినితో సిఎం ముఖాముఖి మాట్లాడారు. అనంతరం సిఎం చంద్రబాబు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని, ఇళ్లతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలు, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రామానాయుడు, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, పలువురు ఎంఎల్ఏలు, ఎంఎల్‌సిలు, నాయకులు, కార్యర్తలు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు



స్టాల్స్‌ను పరిశీలించి మాట్లాడుతున్న సిఎం



మెమెంటో అందజేస్తున్న చంద్రబాబు

తణుకు నియోజకర్గ అభివృద్ధి పనులకు సిఎం హామీలు

ప్రజావేదిక కార్యక్రమంలో ఎంఎల్ఏ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు నియోజకర్గంలో పలు సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆటోవర్కర్స్, మెకానిక్‌లు దాదాపు ఐదు వేల మంది ఉన్నారని, అటో నగర్ ఏర్పాటుకు రూ.ఆరు కోట్ల నిధులు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో ఇళ్లస్థలాల విషయంలో దోపిడీ జరిగిందని, నిడదవోలుకు దగ్గర కాపవరంలో 23 ఎకరాలు కొనుగోలు చేసి 1,333 మందికి ఇళ్లస్థలాలు ఇచ్చారని, దూరం కావడంతో లబ్దిదారులు ఎవరూ ఇళ్లు కట్టుకోలేదని వారందరికీ న్యాయం చేయాలని కోరారు. టిడ్కో ఇళ్లు ఇవ్వాలని అడిగారు. తణుకులో ట్రాఫిక్ నిలిచిపోతోందని, కెనాల్ బండ్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి రూ.20 కోట్లు ఇవ్వాలని సిఎంను ఎంఎల్ఏ కోరారు. అంతేకాకుండా సమ్మర్ స్టోరేట్ ఏర్పాటు, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి నిధుల సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. మెయిన్ ఆర్అండ్‌బి రోడ్డుకు నిధులు, బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిఎంను కోరారు. దీనిపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ రాధాకృష్ణ డైనమిక్ ఎంఎల్ఏ అని, తన నియోజకవర్గ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కోరారన్నారు. తణుకు మున్సిపాల్టీ అభివృద్ధికి కృషిచేసిన ముళ్లపూడి హరిశ్చంద్రరావును గుర్తుచేసుకోవాల్సి ఉందని సిఎం తెలిపారు. తణుకు మున్సిపాల్టీ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయిస్తున్నట్లు సిఎం ప్రకటించారు. అదేవిధంగా ఆర్అండ్‌బి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. నేషనల్ హైవే గ్రాంటుతో ప్రధాన రహదారి పనులు చేసుకోవచ్చన్నారు. జిఎన్‌వి కెనాల్ బండ్, ఆటోనగర్‌తోపాటు, ఎంఎల్ఏ అడిగినా పనులకు నిధులిస్తామన్నారు. తణుకు, భీమవరం రోడ్డు అభివృద్ధికి నిధులిస్తామన్నారు. జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ పెడతామని, ఇరిగేషన్ పనులు మంత్రి రామానాయుడు చూసుకుంటారన్నారు.

సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ఎగబడిన జనం

ప్రజావేదికకు విచ్చేసిన పలువురు తమ వ్యక్తిగత సమస్యలపై సిఎంకు వినతులు ఇచ్చేందుకు ఎగబడిన పరిస్థితి నెలకొంది. ప్రజావేదికలో ఓ యువతి నందిని మాట్లాడుతూ తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని, టెస్టులకు పరీక్షలకు చాలా డబ్బులు ఖర్చు అవుతున్నాయని, పింఛన్‌తోపాటు, సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకోవాలని సిఎంను కోరింది. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు సిఎం ఆదేశించారు. ఏసమ్మ అనే మహిళ తన కుమార్తెకు మతిస్థితిమతం లేదని, ఆర్యోగ ఖర్చుల భరించలేకపోతున్నామని, ఆదుకోవాలని కోరింది. ఎంఎల్ఏను కలవాలని సిఎం తెలిపారు. సిఎంఎ తన ప్రసంగం ముగించుకుని వెళ్లిపోయేటప్పుడు చాలా మంది తమ సమస్యలపై వినతులు సిఎంకు ఇచ్చేందుకు పెద్దఎత్తున గుమిగూడి ఎగబడ్డారు. సిఎం ఆగి చాలా మంది వద్ద వినతులు తీసుకున్నారు. వినతులు ఇవ్వలేని కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారు.

టిడిపి నాయకులు, కార్యర్తలకు దిశానిర్ధేశం

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ముగిసిన తర్వాత టిడిపి నాయకులు, కార్యకర్తలతో సిఎం ప్రత్యేకం సమావేశమయ్యారు. ఈకార్యక్రమానికి మీడియాకు అనుమతి లేదు. దాదాపు గంటన్నరకు పైగా ఈ సమావేశం సాగింది. అంతర్గత సమాచారం ప్రకారం తాను బాగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని, అదేవిధంగా మీరుకూడా ఉండాలని సిఎం చంద్రబాబు కార్యకర్తలకు సూచించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అందుకే ఎక్కడికి వెళ్లినా కార్యకర్తలతో సమావేశం పెడుతున్నానని తెలిపారు. గడిచిన ఐదేళ్లతో అంతా ఇబ్బంది పడ్డామన్నారు. ముఖ్యమంత్రిగా ఉంటూ చాలా కష్టాలు చూస్తున్నానన్నారు. సమస్యలు ఎలా పరిష్కరిస్తారని అంతా అడుగుతున్నారు. దానికి ఒకటే మార్గం.. పారిపోవడం, ఫైట్ చేయడం అన్నారు. అఫైట్ నేను చేస్తున్నానని తెలిపారు. ఎక్కడైనా కార్యకర్తల కాంట్రాక్ట్ బిల్లులు రాజకీయంగా ఆపి ఉంటే చర్యతీసుకునే బాధ్యత మంత్రులు, ఎంఎల్ఏలదే అన్నారు. అనుభవం, పరిగెత్తే యువత పార్టీకి అవసరమన్నారు. ఆ విధంగానే పదవులు ఇస్తున్నట్లు తెలిపారు. పార్టీకి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే ఒకటి, రెండుసార్లు చూస్తా, తర్వాత చర్యలు గట్టిగా ఉంటాయని హెచ్చరించారు. ఈసారి మహానాడు కపడలోపెడుతున్నామని తెలిపారు. అంతా ఎప్పుడూ 2029 ఎన్నికల్లో గెలుపుపైనే దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పనితీరు బాగాలేని కస్టర్ ఇన్‌ఛార్జులను సిఎం మందలించినట్లు సమాచారం. నా చుట్టూ తిరిగితే లాభంలేదు.. మీ పని ప్రజలు చుట్టూ తిరుగుతూ ఓట్లేయించడం.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అన్నారు.



దోసపాడులో పేదలతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన
సమస్యలు పరిష్కరించాలి

దోసపాడు, పోతునూరు గ్రామాల్లోని అసైన్డ్ భూములు ఆక్రమించుకున్న వారి వివరాలు బహిర్గతం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. మండలంలో సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ప్రజా చైతన్య యాత్ర శనివారం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 18వ తేదీ వరకూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేయడం కోసం మండలాల్లో సైకిల్, పాద యాత్రలు, పర్యటనలు నిర్వహించడం జరుగుతోందన్నారు. దాంట్లో భాగంగానే దెందులూరు మండలంలో సైకిల్ యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఈ యాత్ర సందర్భంగా గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కార్మికులు, దళితులు, పేదలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను యాత్ర బృందం దృష్టికి వచ్చాయని తెలిపారు. ప్రధానంగా ఈ గ్రామాల్లో భూమి, ఇళ్ల స్థలాలు, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు వంటి సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో దళితుల భూములు, అసైన్డ్, సీలింగ్ భూములను ఆధిపత్య వర్గాలు, భూస్వాములు ఆక్రమించుకున్నారని విమర్శించారు. అసైన్మెంట్ చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అమలు చేయకపోగా చట్టాన్ని తుంగలో తొక్కే భూస్వాములకు అండగా నిలిచారని విమర్శించారు. దోసపాడు, కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో వందలాది ఎకరాల అసైన్మెంట్ భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. ఈ భూములపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని, జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు, పంచాయతీ అధికారులు స్పందించాలని కోరారు. కొవ్వలి తాగునీటి చెరువు సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఆ నీరు తాగడం వల్ల డయేరియా, మలేరియా, కలరా వంటి వ్యాధులతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారన్నారు. వందలాది ఎకరాల్లో చేపల చెరువులను అక్రమంగా తవ్వడం వల్ల నిత్యం తాగునీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై రానున్న కాలంలో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం పి.రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో పేదలు, దళితులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం పోరాడుతోందని తెలిపారు. రానున్న కాలంలో ఈ ప్రాంతంలో పేదలకు ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం తీసుకెళ్లడంలో సిపిఎం కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ యాత్రలో సిపిఎం జిల్లా నాయకులు కె.లెనిన్, మండల నాయకులు డి.నాగేంద్ర, పి.ఆనందరావు నాయకత్వం వహించారు.

స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టర్ వెట్రి సెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

వెనుకబడిన తరగతుల కోసం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం తెలిపారు. 2024-25లో రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల బిసిఎస్ (బిసి-ఎ, బిసి-బి, బిసి-ఐ అండ్ బిసి-ఇ) వర్గాల వారికి స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీ (బి ఫార్మసీ, డి ఫార్మసీ చదువుకున్న నిరుద్యో యువతకు), మేదర, కుమ్మరి శాలివాహన వాహన వారికి వృత్తిపరంగా బుట్టలు అల్లిక, కుండలు తయారు చేసుకుంటున్న వారి నిమిత్తం పథకాల కింద బ్యాంకులోను, ప్రభుత్వ సబ్సిడీతో ఆర్థిక సాయం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు ఆర్యవైశ్య, రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, మరియు ఇబిసి సామాజిక వర్గాల వారికి జిల్లా బిసి కార్పొరేషన్ ద్వారా బ్యాంకులోను, ప్రభుత్వ సబ్సిడీతో ఆర్థిక సాయం మంజూరు చేయబడతాయన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న (బిపిఎల్) అభ్యర్థులు https://apobmms.apcf-ss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుందుకు ఈనెల పదో తేదీ నుంచి 22వ తేదీ వరకూ అవకాశం కల్పించినట్లు తెలిపారు. పైఅర్హతలున్న లబ్ధిదారులు నేరుగా వారి రేషన్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటో, కుల ధృవీకరణ పత్రం, విద్యార్హతలు, పథకం మంజూరుకు కావాల్సిన సర్టిఫికెట్లతో దగ్గరలోని నెట్ సెంటరు, మీ సేవా గ్రామ సచివాలయంలో https://apobmms.apcfss.in ద్వారా ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆర్‌జియుకెటిలో ఘనంగా ముగిసిన సిగ్నస్-25

విశేషంగా ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటిలో ఈ నెల 14, 15 తేదీల్లో సిగ్నస్-25 వార్షిక సాంస్కృతిక మహోత్సవ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. చివరిగా 2019లో జరిగిన ఈ మహోత్సవం 'రివైవింగ్ ది టైంలెస్ ట్రెడిషన్స్' అనే నేపథ్యంతో మళ్లీ 2025లో పున రావృంచింది. మరుగున పడిపోతున్న మన సంస్కృతి సంప్రదాయాలను మళ్లీ భావితరాలకు తెలియపరచడమే ఈ నేపథ్యం ముఖ్య ఉద్దేశం. సిగ్నస్-25 కేవలం రెండు రోజులకే పరిమితం కాకుండా దాదాపు 15 రోజుల ముందు నుంచే ప్రీ-ఈవెంట్స్ అనే పేరుతో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఫిబ్రవరి 24వ తేదీన డైరెక్టర్ అమరేంద్ర కుమార్ ఫ్లైయర్ లాంచ్‌తో సిగ్నస్-25 ప్రీ-ఈవెంట్స్ ప్రారంభించారు. ఎచోస్ ఆఫ్ ద పాస్ట్ అనే పేరుతో డిబేట్ కాంపిటీషన్ రెండు రౌండ్లలో నిర్వహించారు. ఎంతోమంది విద్యార్థులకు వంట చేయడం పట్ల ఆసక్తి ఉండటం వల్ల కిచెన్ క్రానికల్స్ అనే ఆలోచనతో పోటీని నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు వంట చేయడంలో తమ ప్రతిభను కనబరిచారు. ఎంతో ట్రెండ్‌లో ఉన్న స్క్విడ్ గేమ్ అనే వెబ్ సిరీస్‌ను ఆధారంగా తీసుకుని స్క్విడ్ వార్ పోటీ నిర్వహించారు. ఇందులో ఉత్సాహం కలిగించే వివిధ రకాలైన చిన్నప్పటి ఆటలను విద్యార్థుల మధ్యన పోటీలుగా పెట్టారు. వంద మందికే పరిమితమైన ఈ ఆటలో చివరకు ఒక్కరే విజేతగా నిలిచారు. ఇంకా పలు పోటీలను నిర్వహించారు.



సిగ్నస్-25 కార్యక్రమంలో వేదికపై ఆర్‌జియుకెటి సిబ్బంది

కన్నాపురం రేంజర్, సబ్ డిఎఫ్ఒను సస్పెండ్ చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కన్నాపురం రేంజర్ సబ్ డిఎఫ్ఒను వెంటనే సస్పెండ్ చేసి ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. గుల్లపూడి గ్రామ పెద్దల సమావేశం మడకం వెంకమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, గిరిజన జ్యోతి జిల్లా అధ్యక్షులు కురం సత్యనారాయణ దొర మాట్లాడుతూ మడకం యాకోబుపై దాడి చేసి ఐదు రోజులవుతున్నా కన్నాపురం రేంజర్ సబ్ డిఎఫ్ఒపై ఎటువంటి యాక్షన్ తీసుకోలేదన్నారు. ఎస్‌సి ఎస్‌టి కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినప్పటికీ తాత్సారం చేస్తున్నారన్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోకపోతే గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మడకం యాకోబుకు మెరుగైన వైద్యం చేయించాలని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ ఆదివాసీ పాస్టర్ అసోసియేషన్ నాయకులు పీలీప్ పూనెం శేఖర్, తెల్లం ఇశ్రాయేలు, గిరిజన సంఘం నాయకులు పోలోజు నాగేశ్వరరావు, మడకపాటి అనూష, పూనెం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

వన సంరక్షణ సమితి కూలీలకు సుమారు రూ.5 కోట్ల వరకు బకాయిలు

విడుదల చేయాలని అటవీ శాఖ జిల్లా అధికారికి వ్యకాస వినతి



అటవీ శాఖాధికారికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో వన సంరక్షణ సమితిల్లో పనిచేస్తున్న కూలీలకు వేతనబకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు అటవీ శాఖ జిల్లా అధికారి శుభంకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కమిటీ బృందం శనివారం వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గిరిజనులు, పేదలు అడవిలోకి వెళ్లి తునికాకు కోసి ఎండబెట్టి 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి రాష్ట్రం విడిపోయినప్పటి నుంచి నేటి వరకు తునికాకు బోనస్ బకాయిలు సుమారు రూ.ఐదు కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, పేదల పట్ల ప్రభుత్వం, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఎర్రని ఎండలో పనిచేసిన కూలీలకు నేటికీ బోనస్ బకాయిలు ఇవ్వకపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలు, పేదలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి కోసం ఏళ్ల తరబడి పేదలు, గిరిజనులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. అటవీ ప్రాంత పేదలకు అండగా నిలబడాల్సిన అధికారులు పేదలను గాలికి వదిలేసారని విమర్శించారు. మరోపక్క మెట్ట ప్రాంతంలో అటవీ భూముల్లో వన సంరక్షణ సమితిల పేరుతో పనిచేస్తున్న దళితులు, గిరిజనులు ఇతర పేదలకు రావాల్సిన వేతన బకాయిలు నేటికీ అందక నానా అవస్థలు పడుతున్నారన్నారు. లింగపాలెం మండలం టిహెచ్ఆర్ పాలెం విఎస్ఎస్‌కు కటింగ్ ఆర్డర్ ఇవ్వాలని గత కొంతకాలంగా పేదలు అడుగుతున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. బోగోలు విఎస్ఎస్‌లో పనిచేసిన కూలీలకు నేటికీ కూలి పనుల వేతనాలు ఇవ్వలేదని మండిపడ్డారు. ఉంగుటూరు మండలం గొల్లగూడెం, చిన్న ఎల్లమిలి, పెద్దఎల్లమల్లి, ఎర్రమళ్ల గ్రామాల్లో పేదలు విఎస్ఎస్ఎల్‌లో పని చేస్తున్నారని, వారికి విఎస్ఎస్‌లో పనిచేసిన కూలీలు వేతన బకాయిలు సుమారు రూ.లక్ష పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో కటింగ్ చేసిన జామాయిల్ డబ్బులు నేటికీ ఇవ్వలేదని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించి పేదలకు, దళితులకు, గిరిజనులకు వేతన బకాయిలు విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని వారికి అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఎఫ్ఒ శుభం మాట్లాడుతూ పేదల పక్షాన అటవీశాఖ అధికారులు నిక్కచ్చిగా పనిచేయాలని సూచిస్తామన్నారు. పేదలకు రావాల్సిన వేతనబకాయలు, పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ బకాయిలు వెంటనే విడుదల చేయడం కోసం రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

'పది' పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి


జిల్లాలో 133 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

పరీక్షలు రాయనున్న 25,179 మంది విద్యార్థులు

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, జిల్లాలో 133 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఎ కేటగిరి కేంద్రాలు 41, బి కేటగిరి కేంద్రాలు 58, సి కేటగిరి కేంద్రాలు 34 ఉన్నాయని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ చొప్పున 133 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను, 133 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 31 స్టోరేజ్ పాయింట్లను, ఆరుగురు సభ్యులతో ఫ్లయింగ్ స్క్వాడ్‌ను, 20 మంది సి సెంటర్ రూట్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. అలాగే కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రంగాపురం, లక్కవరం, కోరుకొల్లు, టి.నరసాపురం, జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 12,961 మంది బాలురు, 12,218 మంది బాలికలు మొత్తం 25,179 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఓపెన్ స్కూల్స్ పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయని, ఇందుకు 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, 793 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థులను గంట ముందు పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతిస్తారని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరని, విద్యార్థులు పాఠశాల యూనిఫామ్ ధరించి పరీక్షలకు హాజరు కాకూడదని, సివిల్ డ్రెస్‌లోనే రావాలని ఆమె తెలిపారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

మహోన్నత వ్యక్తి మార్క్స్

ప్రజాశక్తి - చింతలపూడి

దోపిడీ రహిత సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించిన మహనీయుడు, మహోన్నత వ్యక్తి మార్క్స్ అని సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, నాయకులు రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. కమ్యూనిజం సిద్ధాంత వేత్త కారల్ మార్క్స్ 142వ వర్ధంతి సభను చింతలపూడి ప్రజాసంఘాల కార్యాలయం వద్ద నిర్వహించారు. తొలుత కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం కారల్ మార్క్స్ సిద్ధాంతాలు ప్రాచుర్యం పొందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.అశోక్, పి.సర్వేశ్వరరావు, ఆర్.ధర్మారావు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్‌కు దరఖాస్తుల స్వీకరణ


ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో కామన్ అడ్మిషన్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31 వరకు గడువు ఉందని చెప్పారు. ముసునూరు పాఠశాలలో ఐదో తరగతికి 80 సీట్లకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముసునూరు గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.ప్రవీణి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని కొత్తూరు, కొన్నంగుంట గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం విజయవంతంగా నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ తెలిపారు. రెండు గ్రామాల్లో తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ క్యాంపులను నూజివీడు మండల పరిధిలోని కొత్తూరు, కొన్నంగుంట గ్రామ ప్రజలు వినియోగించుకున్నట్లు తెలిపారు. మరికొన్ని క్యాంపులు నూజివీడు నియోజకవర్గ పరిసరాల్లో నిర్వహిస్తామని, పేదలు నివసించే ప్రాంతాల్లో వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు తమ ట్రస్ట్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని వివరించారు. వైద్య సేవలు అవసరమైన పేదలు 9640324266 సెల్ నెంబర్‌లో సంప్రదించవచ్చని చెప్పారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ తిరివీధి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.



మందులు అందిస్తున్న ప్రముఖులు

లక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కోకో కాయల కోత పనికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన కొప్పాల లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకుని రూ.పది లక్షల పరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెక్కాడితే డొక్కాడని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న లక్ష్మి మృతి బాధాకరమని తెలిపారు. లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు విద్యుత్ సంస్థ కూడా కుటుంబాన్ని ఆదుకోవాలని పేర్కొన్నారు.

26 మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని జంగంగూడెంలో ఉన్న పొట్లూరు వెంకట చలపతిరావు, కృపావతమ్మ ఐటిఐ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 26 మంది యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ మాట్లాడుతూ జాబ్ మేళాకు మొత్తం 41 మంది యువతీ యువకులు హాజరు కాగా వారిలో 26 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సి డాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. నిరుద్యోగ యువత నుంచి జాబ్ మేళాకు మంచి స్పందన లభించిందన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మరికొన్ని జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్లపై గుంతలు పూడ్చాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

సంక్రాంతి కల్లా గుంతలు లేని రోడ్లు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కేవలం 50 శాతం వరకే గుంతలు పూడ్చారని, మిగతావి అలాగే ఉన్నాయని, వాటిని వెంటనే పూడ్చాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె.కాలేషా డిమాండ్ చేశారు. పట్టణంలోని గురుపట్లగూడెం రోడ్డులో ఎక్కడ గుంతలు అక్కడే ఉన్నాయని, అదేవిధంగా బైపాస్‌లో అక్కడక్కడ, చింతలపూడి నుంచి సుప్రీంపేట, చింతలపూడి నుంచి పాత చింతలపూడి, చింతలపూడి నుంచి నాగిరెడ్డిగూడెం రోడ్లలో ఎక్కడ గుంతలు అక్కడే ఉన్నాయన్నారు. వీటిని వెంటనే పూడ్చాలని ఆర్‌అండ్‌బి ఎఇకి, పంచాయతీరాజ్ అధికారులకు సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందించారు. వినత పత్రం ఇచ్చిన వారిలో తాడిగడప మాణిక్యాలరావు, మోర్తా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నూజివీడులో చోరీ

రూ.1.10 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని బాపునగర్‌లో ఉన్న చెరువు గట్టు ప్రసాద్ ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని కుటుంబ సమేతంగా మనవరాలి పెళ్లికి వెళ్లారు. తిరిగి శనివారం వచ్చి చూడగా తాళం బద్దలు కొట్టి ఉండడాన్ని గమనించారు. ఇంటి తలుపులకు ఉన్న తాళాలు బద్దలు కొట్టిన అగంతకులు, లోపల బీరువా, చెక్క పెట్టెలను కూడా బద్దలు కొట్టారు. వాటిలో దాచి ఉంచిన రూ.1.10 లక్షల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



పాము కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కోరుటూరు పునరావాస కాలనీ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన ఎం.ప్రసాద్ అనే వ్యక్తి శనివారం తన మిత్రులతో కలిసి పి.ఆంకంపాలెంలో ఫంక్షన్‌కి వచ్చి తిరిగి బయలుదేరారు. ఈ క్రమంలో కోరుటూరు పునరావాస కాలనీ సమీపంలోని మొక్కజొన్న తోటలో బహిర్భూమికి వెళ్లగా గుర్తు తెలియని పాము కాటు వేసినట్లు పక్కనే ఉన్న మిత్రులకు తెలిపాడు. మిత్రులు వెంటనే అతడిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ఘనంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర
ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత నగరంగా రూపుదిద్దుదామని కలెక్టర్ వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పిలుపునిచ్చారు. ఏలూరులోని ఆర్ఆర్.పేటలో ఎన్‌టిఆర్ పార్క్ వద్ద శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత దుకాణదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ జ్యూట్, క్లాత్ బ్యాగులను వినియోగించేలా అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌టిఆర్ పార్కులో కాలుష్య నివారణలో భాగంగా అధికారులందరూ మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్లాత్ బ్యాగ్స్‌ను వినియోగించాలని తెలిపారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ నగరాన్ని స్వచ్ఛ ఏలూరుగా మార్చేందుకు కృషి చేసే డివిజన్‌లో ఉన్న మేస్త్రీలకు ప్రతినెలా రూ.పది వేలు బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. అనంతరం వారి డివిజన్లను శుభ్రంగా ఉండేలా చూసుకునే కార్పొరేటర్లకు, నగర ప్రజలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఏలూరు : కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో జెసి పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం ప్రహరీ గోడలకు సున్నం వేశారు.

ఏలూరు స్పోర్ట్స్ : జిల్లా వ్యాప్తంగా పోలీసులంతా కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులంతా ఆయా పోలీస్ స్టేషన్ల ఆవరణలను శుభ్రం చేశారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కార్యక్రమం నిర్వహించారు. రోడ్లను ఊడ్చి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలోని వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య మాట్లాడారు. గొల్లపల్లిలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జెడ్‌పి హై స్కూల్ ఆవరణాన్ని విద్యార్థులతో పరిశుభ్రం చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధికారాణి మాట్లాడారు.

కొయ్యలగూడెం : మండలంలోని బయ్యన్న గూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి చింతల పూడి నియోజకవర్గ పరిశీలకులు, పోలవరం ఎఎంసి మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి లింగిశెట్టి అనంతలక్ష్మి, జనసేన జిల్లా కార్యదర్శి ముద్దు తేజ, బిజెపి నాయకులు బాలం నరేష్, పంచాయతీ కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

భీమడోలు : పొలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం, పునర్ వినియోగ వస్తువుల ప్రోత్సాహం చేపడుతున్న గ్రామపంచాయతీ సేవలు అభినందనీయమని ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. గ్రామ పంచాయితీ పరిధిలో సర్పంచి షేక్ రహీమా బేగం హసేన, గ్రామపంచాయతీ కార్యదర్శి జయరామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా పురవీధుల్లో గ్రామస్తు లకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను తెలియజేసేందుకు ప్లకార్డులు ధరించి ర్యాలీ నిర్వహిం చారు. గ్రామ సర్పంచి అధ్యక్షతన గ్రామసభను చేపట్టారు. వ్యాపారులకు అవగాహన కల్పిం చేందుకు ప్రచారం, తనిఖీలు నిర్వహించారు. భీమడోలు జంక్షన్‌లో మానవ హారంగా ఏర్పడ్డారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక భవనంలో ప్రజల అవసరం మేరకు పది కుర్చీలు అందించిన పంచాయతీ పాలక మండలి సభ్యులు నానాది రాజారత్నంను సర్పంచి, ఎంపిడిఒ అభినందించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య సేవల సమన్వయకర్త డాక్టర్ పాల్ సతీష్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి (డిఎల్‌పిఒ) మహ్మద్ రజాఉల్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం దుకాణాదారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్, సర్పంచి చిర్రి జగదాంబ, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ దేవమ్మ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక ఫైర్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.నారాయణరావు, ఆర్ఎంఒ డాక్టర్ జి.దీప్తి ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రసూల్, డాక్టర్ అజయ్, డాక్టర్ దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కునూరు : కమ్మరిగూడెంలోని కార్యక్రమం నిర్వహించారు. మరుగుదొడ్లు లేని వారికి నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఇ వీరస్వామి కివాక పంచాయతీ సర్పంచి మడివి రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రకాష్, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిసరాలు శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారులు ఆర్.ఫణీంద్రబాబు, డాక్టర్ ఎఎం.ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి జె.కల్పనారాణి, హెల్త్ సూపర్ వైజర్లు పి.మావుళ్లమ్మ, ఎండిఎఎస్ బేగం, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఎంపిడిఒ జి.మణికుమారి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.హరికృష్ణ, బి.ప్రసాద్‌బాబు, జూనియర్ పి.శేఖర్‌బాబు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయిలో పాఠశాలల విద్యార్థులు సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారంగా నిలబడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ విజయలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, మండల కేంద్రం ద్వారకా తిరుమలలో నిర్వహించిన కార్యక్రమంలో గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు. ఎంఎల్ఎ చీపురుపట్టి శ్రీవారి పరిసరాలను శానిటేషన్ సిబ్బందితో కలిసి శుభ్ర పరిచారు. అనంతరం ఆలయ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంఎల్ఎ ద్వారకాతిరుమల పంచాయతీ పరిధిలోని రోడ్లను, డ్రెయినేజీలను పరిశీలించారు. పిహెచ్‌సిని సందర్శించారు.



ఏలూరు సిటీ : మొక్కలు నాటుతున్న కలెక్టర్


మండవల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బేతపూడి రవితేజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని 16 గ్రామపంచాయతీ పరిధిలో కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జి.రాణి, తహశీల్దార్ కె.రాజకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ఎం.నీరజ, ఎస్.రాకేష్ పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆవరణలో చెత్తాచెదారాన్ని వైద్యాధికారులు, నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది శుభ్రం చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న తుప్పలు పొదలు తొలగించి దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంబాబు, వైద్యాధికారులు సునీల్, కృష్ణంరాజు, భార్గవ్, గుణశేఖర్, విష్ణువర్ధిని, హెడ్ నర్సు బేబి, ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

క్లాత్ సంచులు, కరపత్రాలు అందజేత

ముదినేపల్లి : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య ప్రగతి సాధ్యమవుతుందని మండలంలోని పెదపాలపర్రు గ్రామ సర్పంచి గంట రాకేష్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయం వద్ద గ్రామస్తులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఇంట్లోని తడి, పొడి చెత్త విడివిడిగా గ్రీన్ అంబాసిడర్లకు అందించాలన్నారు. గ్రామాల్లోని వీధుల వెంబడి చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలన్నారు. మహిళలకు క్లాత్ సంచులు, కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.గోవర్ధన్‌రావు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



క్లాత్ సంచులు, కరపత్రాలు అందిస్తున్న సర్పంచి

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

పలుచోట్ల పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన మండల విద్యాశాఖాధికారులు

ప్రజాశక్తి - చాట్రాయి

ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలవ్యాప్తంగా 454 మంది హాజరవుతున్నారని ఎంఇఒ వివిఎస్‌వి.బ్రహ్మచారి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరిలో 432 మంది రెగ్యులర్‌గా, 22 మంది ప్రయివేట్‌గా హాజరవుతున్నారని తెలిపారు. చాట్రాయిలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఫర్నీచర్, లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 977 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఎంఇఒ జె.సురేష్‌బాబు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం నాలుగు పరీక్ష కేంద్రాలకు నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లను, నలుగురు డిపార్ట్‌మెంటల్ అధికారులను, 48 మంది ఇన్విజిలేటర్స్‌ను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం బల్లలు, తాగునీరు, టాయిలెట్స్, ఫ్యాన్లు, లైట్లు తదితర అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పోలవరం : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఎంఇఒ జె.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం మండలంలో రెండు పరీక్షా కేంద్రాలకు ఇద్దరు చీఫ్ సూపరిండెంట్లను, ఇద్దరు డిపార్ట్‌మెంట్ అధికారులను, 23 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. మండలంలో 348 మంది రెగ్యులర్ విద్యార్థులు, 57 మంది ప్రయివేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాబోతున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 23 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మెడికల్ క్యాంపులను, పోలీస్ బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, బల్లలు, టాయిలెట్లు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



కలిదిండిలో...

పరీక్షా కేంద్రాల పరిశీలన

ముసునూరు : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ కె.రాజకుమార్, ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. మండలంలోని ముసునూరు, గోపవరం, చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 144 సెక్షన్ పరీక్ష కేంద్రాల వద్ద అమలులో ఉంటుందని తెలిపారు.

కలిదిండి : మండలంలో ఏర్పాటుచేసిన ఐదు పరీక్షా కేంద్రాలను జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్టు అడిషనల్ కో-ఆర్డినేటర్ కురేళ్ల పంకజ్ కుమార్ తనిఖీ చేశారు. పరీక్ష రాసే విద్యార్థులకు గదిలో గాలి, వెలుతురు ఉండేలా ఫ్యాన్లు, లైట్లు ఉండాలని, తాగునీరు, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంకజ్ కుమార్ సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

ముదినేపల్లి : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ కె.నరేష్ కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్, పెద్దగొన్నూరు జెడ్‌పి హైస్కూల్, ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సహాయమాత హై స్కూల్ పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయన్నారు. 664 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరిలో బాలురు 335, బాలికలు 309 ఉన్నారని తెలిపారు.

పీసా చట్టంపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన కుక్కునూరులో గతంలో పీసా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపొందిన వారికి శనివారం మండల కేంద్రంలో పీసా చట్టంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ప్రత్యేకాధికారి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహారావు, రిసోర్స్ పర్సన్ ఏడుకొండలు, ధర్మ గోవింద్, నాగబాబు, వెలుగు ఎపిఎం భానుమతి, గ్రామ మహిళ సమాఖ్య అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

17నుంచిశిక్షణ

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా జరిగిన పీసా కమిటీ ఎన్నికల్లో గెలుపొందిన ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు, సర్పంచులకు, ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలకు ఈ నెల 17 నుంచి 25 వరకు మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ శిక్షణ తరగతులను స్థానిక వెలుగు కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణకు వచ్చేటప్పుడు సిబ్బంది ఆధార్ కార్డుతో హాజరు కావాలని ఆదేశించారు.

దుర్గారావుకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావును మండలంలోని వంకవారిగూడెంలోని ఆయన నివాసంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు శనివారం రాత్రి పరామర్శించారు. ఆయన కుమారుడి భార్య వెంకటలక్ష్మి ఇటీవల కేన్సర్‌తో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మండలాధ్యక్షులు పసుపులేటి రాము, నాయకులు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఐటిడిఎ పరిధిలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సొసైటీ ఆఫ్ ఆర్టిసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష కిట్లు అందించారు. తెల్లంవారిగూడెంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాములు నాయక్, స్టేట్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి ఎ.శేఖర్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా న్యూ ఢిల్లీ ఎడిహెచ్ అపర్ణ లక్ష్మి హాజరై విద్యార్థులకు పరీక్ష కిట్లు అందించారు. ఈ సందర్భంగా రాములునాయక్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ రామ్మోహన్, ఎటిడబ్ల్యుఒ శ్రీవిద్య, ఎఎంఒ సిరమయ్య, సిఎంఒ శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయులు వసుందరమ్మ పాల్గొన్నారు.



మండవల్లిలో...

మండవల్లి : పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ ఎంపిపి గోపాలకృష్ణ, పలువురు వ్యక్తులు కోరారు. మండలంలోని చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో అధికమార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిని కూడా అందిస్తామని ప్రోత్సహించారు. అనంతరం ఉపాధ్యాయుల సొంత నిధులతో విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే ప్యాడ్లు, పెన్నులు, ఇతర సామగ్రిని వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జయ మంగళ వీర్రాజు, ఘంటసాల మహావిష్ణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎపి టూరిజం డైరెక్టర్ కొడాలి వినోద్ అన్నారు. మండలంలోని చిగురుకోట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో టిడిపి గ్రామ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పరీక్ష కిట్లు వినోద్ శనివారం పంపిణీ చేశారు. అనంతరం వినోద్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ పెరం స్వామి, నాయకులు చలసాని జగన్మోహన్‌రావు, చొప్పరపు ఫణి, టిడిపి గ్రామ ప్రెసిడెంట్ తుమ్మా వీరాంజనేయులు, ముచ్చు నాగేశ్వరరావు, దాసి ఆంజనేయులు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమ ప్రదాత చంద్రబాబు'

ప్రజాశక్తి - ముదినేపల్లి

అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయ ప్రదాత సిఎం చంద్రబాబు అని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వి.నరసింహారావు అన్నారు. ముదినేపల్లిలో కొడాలి వినోద్‌తో కలిసి శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మొదటిసారిగా ఎంఎల్ఎగా శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసి శనివారంతో 47 ఏళ్లు పూర్తి అయిందన్నారు. ఎంఎల్ఎగా 41 ఏళ్లు, ముఖ్యమంత్రిగా 15 ఏళ్లపూర్తి చేసుకున్న రికార్డు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుకే దక్కిందన్నారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి వర్క్‌షాపు

బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్రస్థాయి వర్క్ షాపు ఈ నెల 16, 17 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్నట్లు బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్ షాపులో ఉపాధి హామీ చట్టంపై, గ్రామీణ కష్టజీవులు-సంక్షేమం-అభివృద్ధిపై మేధావులు పాల్గొని కార్యకర్తలకు బోధిస్తారని తెలిపారు.

గడువులోగా గృహ నిర్మాణాల పూర్తికి చర్యలు

ఎంపిడిఒ పద్మావతి దేవి

ప్రజాశక్తి - భీమడోలు

కలెక్టర్ ఆదేశాల మేరకు భీమడోలు మండలంలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణ సంస్థ యూనిట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు తగు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. ఈ మేరకు గృహ నిర్మాణ సంస్థ భీమడోలు సహాయ ఇంజినీర్, ఉపాధి హామీ చట్టం భీమడోలు ఎపిఒ సహాయ సహకారాలను తీసుకుంటున్నట్లు వివరించారు. లబ్ధిదారులను చైతన్యపరిచేందుకు ఆవాస ప్రాంతాలవారీగా గ్రామసభలను నిర్వహించనున్నట్లు తెలి పారు. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎంపిడిఒ, గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజినీర్ మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మే నెలాఖరులోగా 250 నిర్మాణాలు పూర్తి చేయటం లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. తాజాగా ప్రభుత్వం లబ్ధిదారులను మరింతగా ప్రోత్సహించేందుకు సామాజిక తరగతుల వారీగా అదనపు మొత్తాలు రూ.50 వేలకు పైబడి ఇచ్చేందుకు సిద్ధమైందన్నారు. ఈ నేపథ్యంలో 163 మంది లక్ష్యం షరతులకు లోబడి నిర్మాణాలను ప్రారం భించాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా తొమ్మిది మంది ఒసిలు, 88 మంది బిసిలు, 65 మంది ఎస్‌సిలు, ఎస్‌టిలు ఒకరు నిర్మాణాలను పూర్తి చేయాల్సిఉందన్నారు. ఈ క్రమంలో వీరిని చైతన్యపరిచేందుకు గ్రామసభలను నిర్వహి ంచడం, ప్రభుత్వ రంగ వారికి అందే ఇతర అదనపు ప్రయోజ నాలు వివరించనన్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతిని ధుల సహకారంతో లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేం దుకు లబ్ధిదారులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



గడువులోగా గృహ నిర్మాణం పూర్తయిన యూనిట్

IN THE COURT OF THE HON'BLE
Ist ADDL DISTRICT JUDGE
AT: SANGAREDDY
O.S.No. 42 OF 2015
BETWEEN:
Shaik Faqruddin ...Plaintiff
AND
1. K.Ravi Kumar and others ....Defendants
To,
7. Katari Rama Krishna Raju S/o Late Rama SuryanarayanaRaju, Aged 63 years, Occ: Agriculture, R/o H.No. 2-147, Panchayath Road, Opp: Water tank, Palakoderu Mandalam, Kumudavalli, West Godavari District. 534 210.
10. Smt.VasamsettyMahwswari W/o Gopala Krishna, Aged about 5 years, Occ: House wife, R/o H.No:5-375/1, Guru Nagar, Bommuru, East Godavari District.

NOTICE

Take notice that the above named Plaintiff filed the suit for specific performance contract in respect of the suit schedule property on the file of Hon'ble Ist Addl. district and session Judge at Sangareddy. The said case is posted to **28-03-2025** at **10-30** A.M for your appearance by person or through an advocate, failing which the case will be decided in your absence on merits against you.

// BY ORDER OF COURT //

M. GIRIDHAR
Advocate
Sangareddy